ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు

జిల్లా వార్తలు

సోమవారం 12 మే 2025



చుక్కనీరులేని గుడుపల్లె మండలంలోని పెద్దబరినవాడ పెద్ద చెరువు

గుడుపల్లె, వి.కోట మండలాల్లో సమస్య తీవ్రం

33 గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా

హంద్రీ-నీవా నీళ్లతోనే సమస్యకు పరిష్కారం

అడుగంటిన భూగర్భ జలాలు

ఓ వైపు వెంటాడుతున్న వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు పెరిగిన నీటి వినియోగంతో జిల్లాలోని 17 మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. ఎప్పటిలాగే కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో ఈ సమస్య అధికంగా ఉన్నా.. గుడుపల్లె, వి.కోట మండలాల్లో తీవ్రంగా మారింది. గుడుపల్లె, వి.కోట, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో గతేడాదితో పోల్చుకుంటే ప్రస్తుతం భూగర్భజలాలు మరింత లోతుకు వెళ్లిపోయాయి. చౌడేపల్లె, నగరి, విజయపురం, తవణంపల్లె వంటి మండలాల్లో గతేడాదితో పోల్చుకుంటే ఇప్పుడు భూగర్భజలాలు పైకి అందుబాటులోకి వచ్చాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

కలెక్టర్ ఆందోళన : 'కుప్పం నియోజకవర్గంలో భూగర్భ జలాలు అడుగంటడంతో సమస్య తీవ్రంగా మారింది. కుప్పం తర్వాత పలమనేరు నియోజకవర్గం రెండో స్థానంలో ఉంది. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో భూగర్భజలాలు ఆందోళనకరంగా ఉన్నాయి.' ఇటీవల చిత్తూరులో జరిగిన డీడీఆర్సీ సమావేశంలో స్వయంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్న మాటలివి. అంతేకాదు, జిల్లాలోనే గుడుపల్లె మండలంలో భూగర్భ జలమట్టం చాలా దారుణంగా పడిపోయిందని ఆందోళన చెందిన కలెక్టర్.. శుక్రవారం ఆ మండలంలో పర్యటించారు. భూగర్భజలాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో, ప్రజాప్రతినిధులతో చర్చించారు. చెరువుల్లో పూడికతీయడం, చెరువు కట్టలను బలోపేతం చేయడం, చెరువుల్ని అనుసంధానం చేయడం.. వంటి పనుల్ని చేపట్టాలని సూచించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా



గుడుపల్లె మండలం కనుమనపల్లెలో అడుగంటిన బోరు

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 33 గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ సంఖ్య బాగా తక్కువని చెప్పుకోవచ్చు. గతేడాది 95 గ్రామాలకు ట్యాంకర్లు వెళ్లేవి. ప్రస్తుతం 33 గ్రామాలూ గుడుపల్లె, వి.కోట మండలాల్లోనే ఉండడం ఆందోళనకరం. గుడుపల్లెలో 12 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా, 2 గ్రామాలకు స్థానిక బోర్లతో అనుసంధానం చేశారు. అలాగే వి.కోటలో 16 గ్రామాలకు ట్యాంకర్లతో, 3 చోట్ల స్థానిక బోర్లతో అనుసంధానం చేయించారు. గతేడాదితో పోల్చుకుంటే 62 గ్రామాలు తగ్గాయి.

ఏప్రిల్‌లో భూగర్భజలాలు

అడుగంటిన వివరాలు (మీటర్లలో..)

మండలం	ఈ ఏడాది	గతేడాది
గుడుపల్లె	58.26	49.39
వి.కోట	28.94	20.08
కుప్పం	20.13	24.64
రామకుప్పం	19.42	15.15
శాంతిపురం	15.71	14.61

గుడుపల్లె, వి.కోట మండలాల్లో గతేడాది కంటే ప్రస్తుతం సుమారుగా 9 మీటర్ల లోతుకు భూగర్భజలాలు అడుగంటాయి. అందుకే జిల్లా యంత్రాంగం ఆందోళన చెందుతోంది.

పుష్కలంగా ఉన్న వివరాలు (మీటర్లలో..)

మండలం	ఈ ఏడాది	గతేడాది
చౌడేపల్లె	2.37	2.65
విజయపురం	3.08	3.85
నగరి	3.25	3.47
తవణంపల్లె	3.06	5.34

ప్రతి వేసవిలోనూ పశ్చిమ ప్రాంతంలోనే తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తూర్పు ప్రాంతాల్లో అవసరమైన మేరకు భూగర్భజలాలు అందుబాటులో ఉంటున్నాయి.

కుప్పం బ్రాంచి కెనాల్‌తోనే పరిష్కారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించడంతో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతేడాది డిసెంబరులో ఈ కెనాల్‌కు కాంక్రీట్ లైనింగ్ పనులు చేసేందుకు రూ.197 కోట్లను కేటాయించారు. ప్రస్తుతం ఆ పనులు 50 శాతానికిపైగా పూర్తవ్వగా.. జూన్ ఆఖరునాటికి వందశాతం పూర్తయ్యేలా జరుగుతున్నాయి. శుక్రవారం అనంతపురం జిల్లాలో పర్యటించిన సీఎం చంద్రబాబు జూలై 10న హంద్రీ-నీవాను పూర్తి చేసి నీళ్లను వదులుతామని ప్రకటించారు. కుప్పం బ్రాంచి కెనాల్ కుప్పం నియోజకవర్గంలోని 110 చెరువుల్ని నింపుతుంది. దీంతో భూగర్భజలం పుష్కలంగా పెరుగుతుంది. గుడుపల్లెలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితులకు పరిష్కారం లభిస్తుంది.



సరిగప్ప కొట్టాలులోని బోరుబావిలో నీళ్లు లేక ఎండిన బంతిపూల తోట



వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు

క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రూ.150, రూ.100, ఉచిత దర్శనం క్యూలైన్లు కిక్కిరిశాయి. స్వామి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తుల మధ్య ఇబ్బంది తలెత్తకుండా ఆలయ ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షించారు. వేసవి సెలవులు ముగిసే వరకు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఆయన ఆదేశించారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారన్నారు. జిల్లా అధికారులంతా ఉదయం 9 గంటలకల్లా విధిగా పీజీఆర్ఎస్ హాలుకు హాజరవ్వాలని సూచించారు. అలాగే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసుల కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల

చిత్తూరు సెంట్రల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన టీచర్ల సీనియారిటీ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈవో వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీ నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్ఎంగా పదోన్నతుల నిమిత్తం ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, యాజమాన్యాలకు సంబంధించి రెండు దఫాలుగా అభ్యంతరాలు స్వీకరించి.. సవరించినట్లు పేర్కొన్నారు. తుది సీనియారిటీ జాబితాను సైట్‌లో ఉందని, ఉపాధ్యాయులు సరిచూసుకోవాలని కోరారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి



వెదురుకుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): జనారణ్యంలోకి ఓ చుక్కల దుప్పి ఆదివారం వచ్చింది. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం లోని ఓ ఇంట్లోని స్నానపు గదిలోకి చుక్కల దుప్పి వచ్చింది. గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ, పశువైద్య సిబ్బంది కలసి దాన్ని సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు. అంతకు ముందుగా దానికి వైద్యం చేసినట్లు స్థానికులు తెలిపారు.



చిత్తూరు నడివీధి గంగమ్మ (ఫైల్ ఫొటో)

చిత్తూరు గంగజాతరకు సర్వం సిద్ధం

● వంశపారంపర్య ధర్మకర్తల వెల్లడి



అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలను చూపుతున్న సీకేబాబు తదితరులు



ముక్కుపుడక

చిత్తూరు కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని బజారువీధిలో మంగళ, బుధవారాల్లో నిర్వహించే నడివీధి గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం చేసినట్లు వంశపారంపర్య ధర్మకర్తలు సీకే బాబు, హేమంత్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణవీధిలోని గీతాసంఘ భవనంలో వారు మీడియాతో మాట్లాడారు. మంగళవారం వేకువ జామున నాలుగు గంటలకు వంశపారంపర్య ధర్మకర్తలైన సీకేబాబు దంపతులు అమ్మవారికి తొలి పూజ చేసి, అంబలి నైవేద్యం సమర్పిస్తామని చెప్పారు. రాత్రి మహా కుంభనైవేద్యం సమర్పించి, బుధవారం సాయంత్రం అమ్మవారిని జలప్రవేశం చేస్తామన్నారు. పోలీసులు, నగరపాలక, వైద్య సిబ్బంది సహకారంతో భద్రత, పారిశుధ్య, వైద్యసాయంపై ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తులకు పలుచోట్ల దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో రెండు లక్షల మంది భక్తులకు మజ్జిగ, తాగునీరు, పళ్లరసాలు వితరణ చేస్తారని తెలిపారు.జాతర ప్రశాంతంగా జరిగేలా నగరవాసులు, అధికార యంత్రాంగం సహకరించాలని కోరారు. అనంతరం అమ్మవారికి అలంకరించనున్న బంగారు, వెండి ఆభరణాలను ప్రదర్శించారు. వీటిల్లో నూతనంగా తయారు చేసిన ముక్కుపుడక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు వెంకటేష్, వేమారెడ్డి, కె.ఎన్.రవి, గుణశేఖర్, సీఆర్‌సీ రవి, ఆర్ఎస్ఎల్ ఎస్ సుబ్బు, సుభాష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

జాతరపై 'నిఘా నేత్రాలు'

● 24 గంటలూ పర్యవేక్షించనున్న కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది

చిత్తూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో జరిగే గంగజాతరకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. అదేస్థాయిలో జేబు దొంగలు కూడా వస్తుంటారు. జాతర నిర్వహించే బజారువీధి, కొంగారెడ్డిపల్లె, మురకంబట్టు, గిరింపేట, తదితర ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. అక్కడ 24 గంటలపాటు సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. చిన్న సంఘటన జరిగినా పోలీసులు రంగంలోకి దిగుతారు.





బజారువీధిలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ (జడ్పీ) స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని సీఈవో రవికుమార్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత జిల్లా అధికారులు తమ శాఖలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో పాల్గొనాలన్నారు.

6 మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూర్యుడి ప్రతాపానికి జనం విలవిల్లాడుతున్నారు. ఆదివారం ఆరు మండలాల్లో 40 డిగ్రీలకుపైగానే పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాల వారీగా.. అత్యధికంగా పూతలపట్టు, చిత్తూరు, తవణంపల్లెలో 41.6, నింద్ర, నగరి, విజయపురంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే పెనుమూరు, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పంలో 39.7, గుడుపల్లె, యాదమరిలో 38.3, బంగారుపాళ్యంలో 37.9, గంగాధరనెల్లూరులో 37.6, పుంగనూరు, చౌడేపల్లె, గుడుపల్లె, ఐరాల, పాలసముద్రంలో 37.5, కార్వేటినగరంలో 37.1, సదుంలో 36.4, శాంతిపురంలో 35.6, గంగవరం, పెద్దపంజాణిలో 35.4, సోమలలో 35.1, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలో 35, బైరెడ్డిపల్లె, పలమనేరు, వి.కోటలో 34.5, కుప్పంలో 33.2, రామకుప్పంలో 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

హంస వాహనంపై ఆదిదంపతుల చిద్విలాసం



హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగుతున్న మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో పదో రోజు హంస వాహనంపై ఆది దంపతులు విహరించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం హంస వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అదిష్ఠింపజేసి ప్రత్యేకంగా పూలు, ప్రభలు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళ వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా బ్రహ్మణ సంఘం సభ్యులు వ్యవహరించారు.

కమనీయం.. లక్ష్మీ నరసింహుడి కల్యాణం



లక్ష్మీ నరసింహుడి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వైశాఖమాసం, స్వాతీనక్షత్రం, చతుర్దశి సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, మూలమంత్ర హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు. మంగళ వాయిద్యాలు, అర్చకుల వేద మంత్రాల నడుమ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఉభయదారులుగా మండలంలోని కొంగరవారిపల్లికి చెందిన షణ్ముగంపిళ్లై, గెండేవారిపల్లికి చెందిన భాను కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

వీరజవాన్‌కు నివాళులు



మురళీనాయక్‌కు నివాళులు అర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు, సభ్యులు

పలమనేరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఆదివారం ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్ ముష్కరులచే అమరుడైన మురళీ నాయక్‌కు స్థానిక పెన్షనర్ల సంఘం ఘనంగా నివాళులు అర్పించింది. పెన్షనర్ల సంఘం అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు వి. గురురాజారావు, పెన్షనర్ల సంఘ నాయకులు కృష్ణమూర్తి, గౌస్, వీరభద్ర, అంజప్ప, మోహన్, అక్బర్ బాషా, మస్తాని, చంద్రశేఖర్, మాలతి, జిక్రియా, సుబ్రహ్మణ్యంరెడ్డి, గురుస్వామినాయుడు, రామానాయుడు, రమేష్‌బాబు, మస్తాన్, స్వామినాధన్, శ్రీనివాసరావు, చంద్రారెడ్డి, వెంకటేష్, చెంగాలయ్య, నారాయణప్ప, చక్రపాణిశెట్టి, సెల్వకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 15 మంది ఎంపిక



పుంగనూరులో...



బైరెడ్డిపల్లెలో..

పుంగనూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 15 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజీ వైద్యులు దాదాపు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా రెండో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తారని.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సురేశ్, సీవీ రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో వైద్యనిపుణులు 50 మందికి కంటి పరీక్షలు చేసి 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, రమణ, గంగాధరం, చంద్ర, చిన్నప్ప వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మూడు కేసులు నమోదైతే రౌడీషీట్



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న ఘర్షణలు పడి పోలీసు స్టేషన్‌కు వచ్చి కేసులు పెట్టుకోవడంతో ఆర్థికంగా దెబ్బతిని కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉంటాయని సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం పోలీసు స్టేషన్‌కు వచ్చిన పలువురితో ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న గొడవల వల్ల పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేయించుకుంటున్నారని, ఒకరిపైన మూడు, నాలుగు కేసులు నమోదు చేస్తే వారిపై రౌడీషీటర్‌గా కేసులు నమోదు చేయడానికి అవకాశాలు ఉన్నట్లు వివరించారు. చిన్న ఘర్షణలు జరిగితే గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు.

ఘనంగా కల్యాణ వెంకన్న కల్యాణోత్సవం



విశేషాలంకరణలో కల్యాణ వెంకన్న

బైరెడ్డిపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మురళీకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో గత రెండురోజులుగా నిర్వహించిన దర్గా ఉరుసు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. దర్గాలో పలువురు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బోయకొండ గంగమ్మకు వెండి వడ్డాణం విరాళం



ఈవోకి వెండి వడ్డాణం అందిస్తున్న దాత ఆదినారాయణరెడ్డి

చౌడేపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు వెండి వడ్డాణాన్ని అమ్మవారి భక్తుడు విరాళంగా ఇచ్చినట్లు ఉపకమిషనర్, ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం కండివాండ్లపల్లెకు చెందిన అమ్మవారి భక్తుడు ఆదినారాయణరెడ్డి, వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి రూ.50 వేలు విలువైన వెండి వడ్డాణం, గోశాలకు రూ.50,116 నగదును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. అలాగే బెంగళూరుకు చెందిన చంద్రప్ప రూ.50 వేలు, వెంకటేష్ రూ.10 వేలను విరాళాలు అందించినట్లు పేర్కొన్నారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

13న ఆధ్యాత్మిక సాహిత్య సదస్సు

పలమనేరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఈనెల 13న ఆధ్యాత్మిక సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నట్లు పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్, నిర్వాహకులు రంగనాథ్, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సాహిత్య, సామాజిక, భగవద్గీత - ఆధునిక జీవితం అనే అంశాలపై ప్రముఖ రచయిత, కవి, యోగా మాస్టర్ విశ్వర్షి వాసిలి వసంతకుమార్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని మహేశ్వరి ధ్యాన యోగా సైన్స్ అకాడమి, పలమనేరు రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విరూపాక్షమ్మకు గెరిగ పూజ



గెరిగను తీసుకొస్తున్న ఉభయదారులు

కల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో కొలువైన విరూపాక్షమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం గెరిగ పూజతో జాతర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం కలశస్థాపన, కంకణ ధారణ, గంగ స్వీకరణ, గణపతి హోమం, గెరిగ పూజ, దుర్గాహోమం, శక్తిపూజ, అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. తొలిరోజు వేడుకల ఉభయదారులుగా మువ్వల నరసింహులుశెట్టి, సతీష్‌కుమార్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలై భక్తులకు అన్నదానం



పుంగనూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నుంచి తిరువన్నామలై వెళ్లే భక్తులకు రాయల్ పీపుల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి తిరువన్నామలైకు ప్రయాణించే 500 మంది భక్తులకు భోజనం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రాఘవ రాయల్ మాట్లాడుతూ ప్రతినెలా పౌర్ణమి రోజున పుంగనూరు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ నాయకులు జనార్దన్, కుమార్, వేణు, ఆనంద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఆరుగురికి గాయాలు



రొంపిచెర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు కారును ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు గాయపడిన సంఘటన ఆదివారం రొంపిచెర్ల మండలంలో జరిగింది. కడప నుంచి తిరుపతికి వెళుతున్న కారును తిరుపతి నుంచి రాయచోటికి వెళుతున్న ఆర్టీసీ బస్సు పెద్దగొట్టిగల్లు బస్ షెల్టర్ వద్ద ఢీకొంది. ప్రమాదంలో ఆరుగురు గాయపడటంతో వారిని 108 వాహనంలో పీలేరు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

రామకుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో జూదం ఆడుతున్న ఇద్దరిని అదుపులో తీసుకొని వారి నుంచి రూ.2 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటమోహన్ తెలిపారు. మిట్టపల్లె చెరువు సమీపంలో కొంత మంది జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మాహత్యాయత్నం

పుంగనూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పుంగనూరులో జరిగింది. పట్టణంలోని బాలాజీ థియేటర్ సమీపంలో రాజప్ప భార్య స్వాతి(35) కాపురం ఉంటున్నారు. ఇద్దరికీ మనస్పర్థలు రావడంతో స్వాతి పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గుర్తించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కనులపండువగా ద్రౌపదీ కల్యాణోత్సవం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

గుడుపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామగానిపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ద్రౌపదీ సమేత ధర్మరాజుల కల్యాణం కనులపండువగా జరిగింది. ఉదయం ధర్మరాజుల మూల విగ్రహానికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోయకొండలో భక్తుల నిలువు దోపిడీ

- విచ్చలవిడిగా సుమో వాహనదారులు
- దుకాణాల్లో ఎమ్మార్పీకంటే అధిక ధరలు
- చల్లా బాబు ఆదేశాలతో ఈవో ప్రత్యేక చర్యలు
- బోయకొండకు ఉచితంగా భక్తుల తరలింపు



ఉచితంగా తరలిస్తున్న ఆలయ ఆటో



భక్తులను తరలిస్తున్న ఆలయ ట్రాక్టర్

చౌడేపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో అమ్మవారి భక్తులను ఆలయ వాహనాల్లో ఆదివారం ఉచితంగా తరలించారు. కొండపైకి టాటా సుమో వాహనదారులు భక్తుల నుంచి కేవలం రూ.20 టిక్కెట్‌తో తీసుకెళ్లాలి. అయితే వాహనదారులు మాత్రం రూ.30 నుంచి 50 వరకు వసూళ్లు చేస్తుండటంతో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి భక్తులను దోచుకోరాదని కేవలం రూ.20 మాత్రమే వసూలు చేయాలని సుమోలకు ప్రత్యామ్నయంగా కొన్ని ఆటోలు ఏర్పాటు చేశారు. అయితే గత వారంగా ఆటో, సుమో వాహనదారులు ఘర్షణ పడుతున్నారు. విషయం తెలుసుకున్న చల్లా రామచంద్రారెడ్డి ప్రైవేటు వాహనాలను తాత్కాలికంగా నిలుపుదల చేసి ప్రయోగాత్మకంగా ఉచితంగా భక్తులను కొండపైకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకెళ్లాలని ఆలయ ఈవో ఏకాంబరానికి సూచించారు. ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయానికి చెందిన ట్రాక్టర్, ఆటోలలో వేలాది మంది భక్తులను కొండపైకి, కొండ నుంచి కిందకు తరలించారు. దీంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తూ భక్తులను దోచుకుంటున్న ప్రైవేటు వాహనాలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

దుకాణదారుల దోపిడీ

బోయకొండలో దుకాణదారులు సైతం భక్తులను దోచుకుంటున్నారు. ఎంఆర్‌పీ ధరలకంటే అధికంగా భక్తుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. వాటర్ బాటిల్ ధర రూ.30 లకు విక్రయిస్తుండటం గమనార్హం. కూల్‌డ్రింక్స్ సైతం ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తూ జీతం తీసుకుంటున్నా... ఆలయ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న ఓ కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తూ ఉండిపోతోంది. అయినా ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఈవో ఏకాంబరాన్ని వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామని.. వెంటనే దుకాణాల వద్ద ఎమ్మార్పీలకే విక్రయాలు చేయాలని బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పాలాభిషేకం



మురళీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గిరిజన సంఘ నాయకులు



మురళీనాయక్‌కు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

సదుం, మే 11 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి ఏపీ గిరిజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ నాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హరిశివప్ప, ఉమామహేశ్వరరావు, హరి, భానుప్రకాష్, శంకర, ప్రసాద్‌రావు, వెంకటరావు, మేఘన పాల్గొన్నారు.

- రామకుప్పం: ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మురళీనాయక్‌కు ఆదివారం రామకుప్పంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర క్యానిర్వాహక కార్యదర్శి పట్రా నారాయణాచారి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణానాయక్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నేతలు రామూర్తి, వెంకట్రావ్ గౌడ్, కామరాజనాయక్, మహ్మద్‌రఫీ, నరసింహులు, విశ్వనాథ్, వెంకటాచలం, రామలింగారెడ్డి, బాలరాజు, సుబ్రహ్మణ్యం, మంజునాథ్, కేశవరెడ్డి, గజేంద్ర, మునిరాజ్, మాదేశ్, రాజ్‌కుమార్, రామునయక్ పాల్గొన్నారు.

తల్లికి వందనం



తల్లులకు పాదాభిషేకం చేస్తున్న పిల్లలు

పలమనేరు, మే 11 (ఆంధ్రజ్యోతి): దేవుడికి ప్రతిరూపమే అమ్మ అని ప్రముఖ డాక్టర్ రామలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సీతారామయ్య, నాగమణి చారిటబుల్ ట్రస్టు, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమి తి, జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో 150 మంది మాతృమూర్తులను వారి పిల్లలు సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీపురం సీతారామయ్య మాట్లాడుతూ నేటి తరానికి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసీనాథం నాయుడు ఎల్లంపల్లి నరేంద్రబాబు, ధనంజయ, కిషోర్, పుష్ప, తేజస్విని, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కలిసిన పూర్వ విద్యార్థులు

కల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-2009 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగుపెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు రవీంద్ర, వెంకటస్వామి, అన్సర్‌బాషా, రామ్మోహన్‌రెడ్డి, వార్డెన్ రాజన్న, విద్యార్థులు చెంగల్రాయులు, భరత్‌కుమార్, మధు, విక్రమ్ పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వెంకన్న విహారం

సదుం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరగమంద శ్రీవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి హనుమంత వాహనంపై వైభవంగా ఊరేగారు. ఉదయం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. భక్తులు అధికంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రమాదకరంగా కలుజు వంతెన



రక్షణ స్తంభాలు విరిగి ప్రమాదకరంగా ఉన్న పెద్దచెరువు కలుజు వంతెన

పలమనేరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పట్టణానికి ఆనుకొని ఉన్న పెద్దచెరువు కలు టజు వంతెనపై ఇరువైపులా రక్షణ స్తంభాలు విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం పలమనేరు మీదుగా ఉన్న జాతీయ రహదారిపై వేలాది వాహనాలు వెళ్తుంటాయి. పలమనేరు పెద్దచెరువు కట్టపైనే జాతీయ రహదారి ఉంది. అయితే పెద్దచెరువు నిండినప్పుడు కలుజు నీరు వెళ్లేందుకు పెద్ద వంతెనను ఈ జాతీయ రహదారిపై నిర్మించారు. ఈ వంతెన నిర్మించి దాదాపు నాలుగు దశాబ్దాలు గడిచిపోయింది. దీంతో ఈ వంతెనకు ఇరువైపులా అప్పట్లో నిర్మించిన రక్షణ స్థంభాలు విరిగి పోయాయి. దీంతో వాహనాదారులు తప్పనిసరి పరిస్థితుల్లో ఈ వంతెనపైనే వెళ్తున్నారు. ఏమాత్రం వాహనాలు అదుపుతప్పినా ఒకవైపు చెరువులోకి మరోవైపు కలుజు కాలువలోకి పడి పోయి పెను ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఈ వంతెనకు ఇరువైపులా రక్షణగా స్థంభాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సీనియర్ ఉపాధ్యాయుడి మృతి



రెడ్డిమోహన్

పలమనేరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన ఎస్‌టీయూ సంఘానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు రెడ్డిమోహన్ ఆదివారం మృతిచెందారు. రామకుప్పం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రెడ్డిమోహన్ గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఆయన ఆరోగ్యం క్షీణించి ఆకస్మికంగా మృతిచెందారు. రెడ్డిమోహన్ మృతిపై పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు.

ముగిసిన చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు



ఊరేగింపులో చౌడేశ్వరి అమ్మవారు

రొంపిచెర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లె గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మదనపల్లె, రాయచోటి, చిన్నగొట్టిగల్లు తదితర పట్టణాల నుంచి ఉత్సవానికి తొగటవీర క్షత్రియులు, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం చేశారు.

కావమ్మకు పొంగళ్లు



పొంగళ్లు తీసుకెళుతున్న భక్తులు

సదుం, మే 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని భట్టువారిల్లె కావమ్మ, మారయ్య ఆలయంలో మూడు రోజులపాటు తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. చివరిరోజు ఆదివారం సదుం నుంచి మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. జంగాల కథను బుర్రకథ రూపంలో వివరించారు. కంకణ ధారులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బెస్త సంఘం నాయకులు రత్న, నాగభూషణం, దేవేంద్ర, కరెంటు బాబు, భాస్కర్, కుమార్, శీను, దేవ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

రామకుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తేజస్ శనివారం సాయంత్రం నుంచి అదృశ్యం కావడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటమోహన్ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా బాలుడు కనిపించకపోవడంతో రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కెంచనబల్ల సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటమోహన్ తెలిపారు. గుడుపల్లె మండలం అంగనామాలకొత్తూరు గ్రామానికి చెందిన వెంకటేశ్ ఆచారి కెంచనబల్లలోని తన అత్తవారింట్లో రెండేళ్లుగా కాపురం ఉంటున్నాడు. ఇతడు గత సంవత్సర కాలంగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్నట్లు తెలిపారు. ఆదివారం వెంకటేశ్ ఆచారి కర్ణాటక మద్యాన్ని 18 ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటమోహన్ తెలిపారు.

భక్తులతో పోటెత్తిన బోయకొండ

● సేవా టిక్కెట్లతో ఒక్క రోజు రూ.9 లక్షల ఆదాయం



చౌడేపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో పోటెత్తింది. వేసవి సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గంటల సమయం క్యూలైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ, అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

సాయంత్రం నాలుగు గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 30వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ సేవా టిక్కెట్లతో ఒక్క రోజుకే రూ.9 లక్షల ఆదాయం ఆలయానికి చేకూరింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను ఉప కమిషనర్, ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

రేడియోగ్రాఫర్ పోస్టులకు తుది మెరిట్ జాబితా విడుదల

చిత్తూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): రేడియోగ్రాఫర్ పోస్టులకు సవరించిన తుది మెరిట్ జాబితాను ఆన్‌లైన్లో విడుదల చేస్తున్నట్లు డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారికి మాత్రం తాము ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామన్నారు. వీరంతా మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో జరగనున్న కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

కాణిపాకంలో లారీ ఢీకొని తిరువళ్లూరు కోర్టు ఉద్యోగిని మృతి



సెల్వి మృతదేహం

ఐరాల(కాణిపాకం), మే 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో వాహనపూజ చేసే ప్రాంతం వద్ద ప్రమాదవశాత్తు లారీ ఢీకొని తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు కోర్టు ఉద్యోగిని మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. కాణిపాకం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం అరక్కోణంకు చెందిన సెల్వి(36) తిరువళ్లూరు కోర్టులో పని చేస్తోంది. తన భర్త రమేష్‌తో కలసి వరసిద్ధుడి దర్శనార్థం ద్విచక్ర వాహనంపై కాణిపాకానికి విచ్చేశారు. కాణిపాకం బస్టాండు సమీపంలోని వాహన పూజ ప్రదేశంలో సీఎస్సీ పేరుతో ఉన్న లారీ పూజకు వచ్చింది. ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తున ఈ లారీని ఢీకొనడంతో.. సెల్వి లారీ చక్రాల కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కాణిపాకం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోటపల్లెలో మామిడి తోటలపై గజదాడులు

● టన్నుల కొద్దీ కాయలను నేల రాల్చేస్తున్నాయని రైతుల కన్నీరు



విరిచేసిన మామిడిచెట్టు

కల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని మామిడితోటలపై పడి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తున్నాయి. మండలంలో నాలుగు రోజులుగా తిష్ఠ వేసిన 13 ఏనుగుల గుంపు పగలంతా అడవిలో ఉంటున్నాయి. రాత్రయితే అటవీ ప్రాంతం సరిహద్దులోని మామిడి తోటలపై పడుతున్నాయి. చెట్లను విరిచేసి, టన్నుల కొద్దీ మామిడికాయలను నేల రాల్చేస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో అప్పులెలా తీర్చాలని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయల్దేరిన ఏనుగుల గుంపు శనివారం రాత్రి పాళెం పంచాయతీ కోటపల్లె సమీపంలోని అటవీప్రాంతం సరిహద్దుకు చేరుకున్నాయి. కోటపల్లెలోని వెంకట్రామానాయుడు, భాస్కర్‌నాయుడు, గోపికి చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. పూర్ణిమకు చెందిన సుమారు 50 మామిడిచెట్లను విరిచేసి కాయలను నేలరాల్చాయి. తోటకు అమర్చిన ఇనుప గేటును ధ్వంసం చేశాయి. రామచంద్రయ్య, యర్రయ్య, గంగాధర్, వీరభద్రనాయుడు, దామోదర్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, మురళీనాయుడు తదితరుల మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. రైతు హరికి చెందిన పశుగ్రాసాన్ని తినేశాయి. అనంతరం 13 ఏనుగుల గుంపు తిరిగి అడవిలోకి చేరుకున్నట్లు స్థానిక రైతులు తెలిపారు. ఇదిలా ఉంటే.. అటవీశాఖ సిబ్బంది అటవీ సరిహద్దుకు చేరుకుని పగలంతా టపాకాయలు పేల్చి వాటిని బెదరగొడుతుండటం వల్లే రాత్రిపూట తమ పొలాలపై పడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఏనుగుల దాడుల నుంచి తమ పంటలను రక్షించాలని కోరుతున్నారు.



నేలరాలిన కాయలు
ధ్వంసమైన ఇనుపగేటు

వైసీపీలో ముసలం!

● ఎమ్మెల్సీ భరత్‌పై తిరుగుబాటు
● శాంతిపురం జడ్పీటీసీ సస్పెన్షన్‌తో పార్టీలో కలకలం

తీవ్రమైన ప్రజా వ్యతిరేకతతో అధికారం కోల్పోయిన వైసీపీ శ్రేణులు ఉక్కపోతను అనుభవిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉండలేక కొందరు స్వచ్ఛందంగా బయటకు వచ్చి టీడీపీ తీర్థం పుచ్చుకుంటుండగా మరికొందరిని పార్టీ వ్యతిరేక కార్యకలాపాల పేరుతో సస్పెండు చేస్తున్నారు. అటువైపు దూకేశాక జరుగుతున్న ఈ సస్పెన్షన్లు కూడా నవ్వులపాలవుతున్నాయి. 'వైనాట్ కుప్పం' అని ప్రగల్బాలు పలికిన జగన్, కుప్పంలో పార్టీ శ్రేణులను నిలుపుకోలేక సతమతమవుతున్నారు. తాజాగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులుతోపాటు మరో ఇద్దరిని వైసీపీనుంచి ఎమ్మెల్సీ భరత్ సస్పెండు చేయడంతో అసలే అస్థిరంగా ఉన్న ఆ పార్టీలో ముసలం పుట్టింది.



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీటీసీ శ్రీనివాసులు

కుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన శాంతిపురం జడ్పీటీసీ ఎస్.శ్రీనివాసులు, కుప్పం మండలానికి చెందిన మాజీ సర్పంచి వసనాడు మురళి, శాంతిపురం మండలం మొరసనపల్లె సర్పంచి జగదీశ్ భార్య నీలావతిలతో పాటు సుమారు 50-60 మందిదాకా వైసీపీ శ్రేణులు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శాంతిపురం మండలం సొన్నగానిపల్లె పంచాయతీ, కూతేగానిపల్లెలోని జడ్పీటీసీ స్వగృహంలో జరిగిన ఈ సమావేశంలో అదే పార్టీకి చెందిన ఎమ్మెల్సీ భరత్‌పై వ్యవహారశైలిపై దుమ్మెత్తిపోశారు. అంతకుముందు రోజైన శనివారంనాడు జడ్పీటీసీ శ్రీనివాసులు, వసనాడు మురళి, నీలావతిలను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో పార్టీనుంచి సస్పెండు చేస్తూ భరత్ ఇచ్చిన ఆదేశాలే ఈ సమావేశం వెనుక ఉన్న కారణం. అయితే ఎమ్మెల్సీ హోదాలో ఆయనిచ్చిన ఆదేశాలు చెల్లవని సస్పెన్షన్‌కు గురైన ఆ ముగ్గురూ తెగేసి చెప్పారు. ఏదైనా నిర్ణయం తీసుకుంటే పార్టీ అధినేత జగన్ లేదా జిల్లా పార్టీ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి తీసుకోవాలి కానీ తమను సస్పెండు చేయడానికి భరత్ ఎవరని నిలదీశారు. నిజానికి వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తల్ని మోసం చేసి లక్షలు దోచుకున్నారని ఆరోపించారు. ఆ ముగ్గురితోపాటు భరత్ వ్యవహార శైలిని తొలినుంచి వ్యతిరేకిస్తున్న కుప్పం మండలానికి చెందిన పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి చీలేపల్లె రవి కూడా ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. రామకుప్పం మండలానికి చెందిన పార్టీ నాయకుడు ఆరేళ్ల జయప్పతోపాటు సుమారు 60 మందికిపైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. మళ్లీ మరొక సమావేశం ఏర్పాటు చేసి భరత్ ద్వారా మోసపోయిన కార్యకర్తలందరినీ ఒక్కదగ్గర చేర్చి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, ఆయన బాగోతాన్ని అధిష్ఠానం ఎదుట బయట పెడతామని హెచ్చరించారు. వైసీపీ మండల కన్వీనర్ దండపాణి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ వసుంధర భర్త కోదండ రెడ్డిలు వీరికి ప్రతిగా ఎప్పుడో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి భరత్‌కు మద్దతుగా మాట్లాడారు కానీ, వారితో ఉన్నది ముగ్గురు నలుగురు పార్టీ వ్యక్తులు మాత్రమే.

అదీ పాయె

కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, కుప్పం మున్సిపాలిటీతో పోలిస్తే శాంతిపురం మండలంలోనే వైసీపీ ఆదినుంచీ కాస్తోకూస్తో బలంగా ఉంది. అధికారంలో ఉన్నప్పుడు అన్నిచోట్లా బలంగానే ఉన్నట్లు అనిపించింది కానీ, అంతకుముందు ప్రతిపక్షంలో కాంగ్రెస్‌నుంచి బలమైన నాయకులందరూ వైసీపీలో చేరడంతో ఢీ అంటే ఢీ అన్నట్లు కొనసాగింది. జడ్పీటీసీతోపాటు మండల కన్వీనర్ల సస్పెన్షన్ల పుణ్యమా అని ఈ మండలంలో ప్రతిపక్షం నిలువునా రెండుగా చీలినట్లయింది. కుప్పం మున్సిపాలిటీ, రామకుప్పం మండలాల పార్టీ శ్రేణులను ఇటీవల వేర్వేరుగా అధినేత జగన్ కలిశారు. అప్పట్లోనే ఈ సస్పెన్ల గురించి చర్చ జరిగినట్లు సమాచారం. రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు, ఇటీవల జరిగిన కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పార్టీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పార్టీ విప్‌ను ధిక్కరించి అధికార టీడీపీ అభ్యర్థులకు ఓటేయడం వంటివి ప్రస్తుతం సస్పెన్షన్‌కు గురైన నాయకుల వల్లనే జరిగాయని, ఇంతేకాక టీడీపీ అధికారంలోకి రాగానే ఎంపీటీసీలు పలువురు ఆ పార్టీలోకి దూకడానికి కూడా వీరి ప్రోద్బలమే కారణమని అధిష్ఠానాన్ని నమ్మించడంలో ఎమ్మెల్సీ భరత్ సఫలమయ్యారంటున్నారు. ఈ క్రమంలోనే సస్పెన్షన్లు చోటు చేసుకున్నాయి. అంతకుముందు కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా 10 మంది పార్టీ కౌన్సిలర్ల సస్పెన్షన్‌కు అధిష్ఠానానికి భరత్ సిఫార్సు చేశారు. వీరిలో నలుగురు అంతకుముందే పార్టీ మారిపోగా, మరో ఇద్దరు కౌన్సిలర్లు ఎన్నికకు గైర్హాజరయ్యారు. నిజానికి ప్రతిపక్షంలోని నాయకులు, కార్యకర్తలు అధికార పక్షంవైపు దూకడానికి వెనుక ఎవరి ప్రోద్బలమూ లేదు. వారంతటవారే 'అవసరాలకు' అనుగుణంగా ఇటు వచ్చి పచ్చ కండువాలు కప్పుకుంటున్నారు. కానీ ఈ నెపాన్ని తమపై నెట్టివేయడం ద్వారా పార్టీలోని తనకు వ్యతిరేకమైన బలమైన వర్గాలను భరత్ వదలించుకుంటున్నారని ఆ పార్టీ వర్గాలే విమర్శిస్తున్నాయి. ఏదేమైనా ప్రస్తుతం జరిగిన సస్పెన్షన్లతో ఎంతోకొంత బలంగా ఉన్న శాంతిపురం మండలాన్ని కూడా చేజేతులా వైసీపీ పోగొట్టుకుంటోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పార్టీని అమ్ముకుంది నువ్వే!

● వైసీపీ ఎమ్మెల్సీ భరత్‌పై శాంతిపురం జడ్పీటీసీ ధ్వజం

శాంతిపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ చైర్మన్, రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల్లో పార్టీని టీడీపీకి అమ్ముకుని అధిష్ఠానాన్ని, కార్యకర్తలను ఎమ్మెల్సీ భరత్ మోసం చేశారని శాంతిపురం జడ్పీటీసీ ఎస్.శ్రీనివాసులు, కుప్పం మండలం వసనాడు మాజీ సర్పంచి మురళి, మొరసనపల్లె సర్పంచి జగదీశ్ భార్య నీలావతి ఆరోపించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఈ ముగ్గురినీ వైసీపీనుంచి సస్పెండు చేస్తూ భరత్ ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో వీరు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. భరత్ వల్లే పార్టీకి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపించారు. ఎక్కడో హైదరాబాదులో ఉంటూ కుప్పం ముఖం కూడా చూడడంలేదని విమర్శించారు. కార్యకర్తలకు భరత్ ఏమాత్రం అందుబాటులో లేదన్నారు. ప్రజల ద్వారా నేరుగా ఎన్నుకోబడిన జడ్పీటీసీ దగ్గరకు అనేకమంది ప్రజలు వస్తారని, వారందరికీ సేవ చేయాల్సి ఉంటుందన్నారు. దీన్ని తప్పుపట్టి సస్పెండు చేయడం అన్యాయమన్నారు. తమను సస్పెండు చేయడానికి ఆయన రాష్ట్ర అధ్యక్షుడా లేక జిల్లా అధ్యక్షుడా అని నిలదీశారు. ఈ సస్పెన్షన్‌ను తాము అంగీకరించడం లేదన్నారు. నేరుగా పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి లేదా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్దకు వెళ్లి తేల్చుకుంటామని సవాల్ చేశారు. అక్కడా న్యాయం జరగకపోతే కార్యకర్తల అభిప్రాయం తీసుకుని నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఆరేళ్ల జయప్పతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భరత్‌ను విమర్శించే హక్కు మీకు లేదు

ఎమ్మెల్సీ భరత్‌ను విమర్శించే హక్కు ఎవరికీ లేదని వైసీపీ మండల కన్వీనర్ దండపాణి, జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే జడ్పీటీసీ శ్రీనివాసులుతో పాటు వసనాడు మురళి, నీలావతిని ఆయన సస్పెండు చేశారన్నారు. సొంత పంచాయతీలో ఆపోజిట్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ఆయన పరోక్షంగా మద్దతునిచ్చారని ధ్వజమెత్తారు.

ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్‌గా రాజశేఖర్



కుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌గా ఎస్.రాజశేఖర్ నియమితులయ్యారు. పాకాల సమీపం అగ్రహారంలోని రైతు శివయ్య కుమారుడైన ఈయన 20 ఏళ్ల కిందట కుప్పం మండలం కంగుందిలో స్థిరపడ్డారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం దగ్గరి బంధువు కూడా. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉంటూ అమరావతిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్నారు. అప్పుడప్పుడూ కుప్పం వచ్చి కుటుంబ వ్యవహారాలు చక్కబెట్టి వెళ్తుంటారు.

తిరుపతికి మూడు పదవులు

● ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా సుగుణమ్మ ● ఏపీహెచ్‌డీసీ చైర్మన్‌గా పసుపులేటి హరిప్రసాద్ ● తుడా చైర్మన్‌గా డాలర్ దివాకర్ రెడ్డి

తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన మూడో విడత నామినేటెడ్ పదవుల భర్తీలో తిరుపతికి చెందిన కూటమి నాయకులకు మూడు కార్పొరేషన్ పదవులు వరించాయి. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) చైర్‌పర్సన్‌గా సుగుణమ్మ, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీహెచ్‌డీసీ) చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా డాలర్ దివాకర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



● మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ 2019 ఎన్నికల్లో రెండోసారి టికెట్ దక్కించుకుని స్వల్ప మెజారిటీతో ఓటమిచెందారు. అప్పటినుంచి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వైసీపీ అరాచకాలపై పోరాడుతూ వచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా తిరుపతి సీటు జనసేన పార్టీకి పోవడంతో తొలుత నిరుత్సాహపడినా విజయం కోసం శ్రమించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇంచార్జి హోదాలో ఉంటూ పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సభ్యత్వ నమోదులోనూ తిరుపతిని టాప్‌టెన్‌లో ఉంచారు. ఆమె కష్టాన్ని గుర్తించిని పార్టీ అధిష్ఠానం కీలకమైన ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చింది.



● జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు. పదేళ్లుగా జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా సారథ్య బాధ్యతలు నిర్వర్తించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించి నిరాశపడినప్పటికీ పార్టీ ఆదేశాల మేరకు పని చేశారు. జనసేన కోటా నుంచి ఏపీహెచ్‌డీసీ పదవిని దక్కించుకున్నారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలోనూ ఈయన చురుగ్గా పనిచేశారు.



● 2024 ఎన్నికల ముందు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విజయం కోసం శ్రమించిన డాలర్ దివాకర్ రెడ్డి తొలి నుంచీ తుడా చైర్మన్ పదవికోసం దృష్టి పెట్టారు. ఆదిశగా పావులు కదిపారు. తీవ్ర పోటీ ఉన్నప్పటికీ అన్ని అవాంతరాలను తొలగించుకుని ఎట్టకేలకు తుడా పీఠం దక్కించుకున్నారు.

'వైసీపీ పాలనలో తుడాను ఒక నియోజకవర్గానికే పరిమితం చేశారు. అలా కాకుండా తుడా పరిధి జిల్లా మొత్తం ఉందని, అవసరమైన చోట తుడా నిధులను వెచ్చించేందుకు ప్రయత్నిస్తాను' అని డాలర్ దివాకర్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

6 కాదు ఇక 4 గ్రేడ్లు

● సాకారమైన పంచాయతీ కార్యదర్శుల కల

చిత్తూరు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పంచాయతీ కార్యదర్శుల కల సాకారమైంది. గ్రేడ్‌లను కుదించి పదోన్నతులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఎట్టకేలకు ప్రస్తుత ప్రభుత్వం స్పందించడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులకు ఆరు గ్రేడ్లు అమల్లో ఉన్నాయి. దీన్ని స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3లకే పరిమితం చేసింది. తొలి రెండింటికి సంబంధించిన పంచాయతీలకు జనాభాతోపాటు ఆదాయ పరిమితిని నిర్దేశించింది. మిగిలినవాటిని జనాభా ప్రాతిపదికన విభజించనున్నారు. జిల్లాలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 వరకు 1062 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. వీరిలో డిజిటల్ సహాయకులు ఉన్నారు. గ్రేడ్-4లో ఎక్కువ మంది కొనసాగుతున్నారు. కుదింపుతో గ్రేడ్-3, గ్రేడ్-4 వారు గ్రేడ్-2లోకి వస్తున్నారు. గ్రేడ్-2లోనివారు గ్రేడ్-1లోకి, గ్రేడ్-5లో ఉన్నవారు గ్రేడ్-3లోకి రానున్నారు. సచివాలయాల ఏర్పాటుతో నియమితులైన డిజిటల్ అసిస్టెంట్లను గ్రేడ్-6గా పరిగణిస్తున్నారు. కుదింపు నేపథ్యంలో వీరిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. గ్రేడ్-1లో ఉన్నవారు డిప్యూటీ ఎంపీడీవోలుగా అవకాశాలు పొందుతున్నారు.

ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు

గ్రేడ్-1లో 18 మంది, గ్రేడ్-2లో ముగ్గురు, గ్రేడ్-3లో 110 మంది, గ్రేడ్-4లో 234 మంది, గ్రేడ్-5లో 265 మంది, గ్రేడ్-6లో 432 మంది కలిపి మొత్తం 1062 ఉన్నారు.

రేపటికంతా పూర్తి సమాచారం

ప్రభుత్వం నిర్దేశించిన గ్రేడ్లవారీగా పంచాయతీల విభజనపై జిల్లా శాఖ కసరత్తు చేపట్టింది. మంగళవారానికంతా పూర్తి సమాచారాన్ని అందజేయాలని ఉప ఎంపీడీవోల (ఈవోపీఆర్డీ)లను ఆదేశించింది. డేటా మేరకు కలెక్టర్ ద్వారా ఈనెల 16వ తేదీన కమిషనరుకు నివేదిస్తామని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

వరసిద్ధుడి సేవలో మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నాయుడికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం దర్శించుకున్నారు. అలాగే నేషనల్ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డిపల్లెరామచంద్రన్ కూడా దర్శించుకున్నారు. వీరు స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వారిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్మన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తహసీల్దార్ మహేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణదారుడి నిజాయితీ

● రోడ్డుపై దొరికిన రూ.25 లక్షల బంగారు నగలు పోలీసులకు అప్పగింత



తన బంగారు నగలను అప్పగించిన వినాయక్‌కు రూ.5వేలను బహుమతిగా ఇస్తున్న యోగానంద్

చిత్తూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): తనకు రోడ్డుపై దొరికిన రూ.25లక్షల బంగారు నగలను పోలీసులకు అప్పగించి ఓ కిరాణా దుకాణదారుడు తన నిజాయితీని చాటుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జీడీ నెల్లూరు మండలానికి చెందిన యోగానందం శనివారం ఉదయం 10 గంటలకు చిత్తూరు నగరంలోని విష్ణుభవన్ పక్కన ఉన్న జ్యోతి ట్రేడర్స్ వద్దకు కారులో వచ్చాడు. అక్కడ రెండు బియ్యం మూటలను కొనుగోలు చేసి, వాటిని కారు డిక్కీలో పెట్టడానికి వచ్చాడు. అప్పటికే అందులో ఉన్న రూ.25 లక్షల విలువైన 240 గ్రాముల బంగారు నగలున్న బ్యాగును తీసి రోడ్డుపై పెట్టాడు. డిక్కీలో బియ్యం మూటు వేసుకుని, నగల బ్యాగును రోడ్డుపైనే మరిచిపోయి కారులో బెంగళూరుకు వెళ్లిపోయాడు. కొంతసేపటికి సమీపంలో చిన్న కిరాణా దుకాణం నడుపుతున్న వినాయక్‌కు ఈ బ్యాగు దొరికింది. దాన్ని తెరవగా బంగారు నగలు కనిపించడంతో పోగొట్టుకున్నవారు వచ్చాక ఇచ్చేద్దామని తన దుకాణంలో దాన్ని భద్రపరిచి ఇంటికెళ్లిపోయాడు. మరోవైపు నగల బ్యాగు చిత్తూరులో వదిలేసిన విషయం గుర్తించి, ఆదివారం చిత్తూరుకు వచ్చిన యోగానందం.. రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐలు నెట్టికంఠయ్య, మహేశ్వర్, పోలీసులు, క్రైమ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న వినాయక్ తన దగ్గర ఉన్న నగల బ్యాగును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. నగలన్నీ ఉండటంతో బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. నగలన్నీ తిరిగిచ్చేసిన వినాయక్‌ను ఎస్పీ మణికంఠ, డీఎస్పీ సాయినాథ్ అభినందించారు. నిజాయితీగా బ్యాగును అప్పగించిన వినాయక్‌కు రూ.5వేలను బహుమతిగా యోగానంద్ ఇచ్చాడు. అలాగే ఫిర్యాదు అందిన అరగంటలోనే పోలీసులు అప్రమత్తమవడంపై బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

నేటినుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

● డీఐఈవో శ్రీనివాసులు

చిత్తూరు సెంట్రల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని డీఐఈవో శ్రీనివాసులు తెలిపారు. 15,377 మంది విద్యార్థుల కోసం 35 కేంద్రాల్లో పరీక్ష ఏర్పాట్లు చేశామన్నారు. ఫస్టియర్‌లో 10,236 మంది, సెకండియర్‌లో 3,724 మంది, ఒకేషనల్ ఫస్టియర్‌లో 810 మంది, సెకండియర్‌లో 607 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, కస్టోడియన్లు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బందిని ఇప్పటికే నియమించినట్లు వెల్లడించారు. కాగా, ఈనెల 28నుంచి జూన్ ఒకటో వరకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పరీక్షల నిర్వహణను స్పెషల్ అధికారి దయానందరాజు, డీఈసీ మెంబర్లు బాలసుబ్రహ్మణ్యం, శరశ్చంద్రశేఖర్ పర్యవేక్షిస్తారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● కలెక్టర్ సుమిత్‌కుమార్



పానాటూరు రోడ్డు పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

గుడిపాల, మే 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆదివారం రూ.2.36 కోట్లలో చేపట్టిన మండలంలోని పానాటూరు రోడ్డు పనులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచనల మేరకు మండల కేంద్రంలోని బంగారక్క చెరువులో ఆక్రమణలు తొలగించి, సుందరీకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పానాటూరు రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రించినందుకు ఎస్‌ఐ రామ్మోహన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎంపీడీవో శిరీషా, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా నాయకులు చంద్రప్రకాష్, మోహన్‌రాజ్, హేమాద్రి నాయుడు, అనిల్‌కుమార్, పీటర్, శివ, ఐజాక్, శంకర్ చౌదరి, జయదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టిరోడ్డు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

రానున్న రోజులలో గ్రామీణ ప్రాంతాల్లో మట్టిరోడ్డు లేకుండా సీసీరోడ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం గుడిపాల ఎంపీడీవో కార్యాలయం వద్ద పలు కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు రూ.13.86 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కోలాఊరు, బట్టువాళ్ల ఊరు, పశుమంద ఎస్టీ కాలనీలో గోకులం షెడ్లు, నీటి తొట్టెలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, టీడీపీ సీనియర్ నేత గురజాల చెన్నకేశవుల నాయుడు, నాయకులు ప్రతాప్ నాయుడు, హరిప్రసాద్, విజయలక్ష్మీ, ఉదయ, మధుసూదన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరచిపోలేం



జడ్పీ హైస్కూల్‌లో మాజీ సైనికులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గుడిపాల, మే 11 (ఆంధ్రజ్యోతి): సైనికుల త్యాగాలను మరచిపోలేమని విశ్రాంత హెడ్‌మాస్టర్లు బొడెబ్బ నాయుడు, రంగయ్య నాయుడు, వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కమ్మతిమ్మాపల్లె జడ్పీ హైస్కూల్‌లో 1992-93 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మస్తాన్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సమయం కల్పించుకుని కలవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఈ బ్యాచ్‌కు సంబంధించి సైన్యంలో పని చేసి రిటైర్ అయిన మాజీ సైనికులు నందగోపాల్, విద్యాపతి, ఉప్పు రమేష్, మునిరాజులు, ఆదికేశవులు, రవిచంద్ర, రామయ్య, బాబు, మునస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.40 వేలు విలువ చేసే మైక్‌సెట్ విరాళంగా అందించారు. సర్పంచ్ మధుసూదన్‌రావు, విశ్రాంత డిప్యూటీ డీఈవో సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు

యాదమరి, మే 11 (ఆంధ్రజ్యోతి): జడ్పీ హైస్కూల్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పాతికేళ్ల అనంతరం సమావేశమయ్యారు. అరే మామా... ఒరే మచ్చా... బాసు అంటూ క్లాసులో, స్కూల్లో ఒకటే గొడవలు... ఆ జ్ఞాపకాల రీళ్లు మళ్లీ పాతికేళ్లు దాటిన తరువాత 2000వ సంవత్సరం బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో రీయూనియన్ అయ్యారు. పూర్వ విద్యార్థులు నాగరాజు, బాలాజీ, రసూల్ తదితరులు పాల్గొని పాఠశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి నూతన రంగులు వేసి, పాఠశాల ఆవరణం శుభ్రం చేశారు. అనంతరం పాఠాలు నేర్పించిన గురువులు బాబాసాహెబ్, ప్రసాద్, చంద్రారెడ్డి, గోవింద పిళ్లై, శాంతకుమారి, సంయుక్త, జయవల్లి, నౌషద్‌లను ఘనంగా సన్మానించారు.

నగరిలో...



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నగరి, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని పెరుమాళ్‌గుడి వీధిలో మూడు దశాబ్దాల క్రితం పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పించిన పాఠశాల వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వృత్తి, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో వున్న వారు మళ్లీ తాము చదివిన పాఠశాలలో పాఠాలు నేర్చిన గదిలో హాజరై బాల్యంలో గడిపిన ఆనందక్షణాలను నెమరువేసుకున్నారు. బాల్యస్మృతులను నెమరువేసుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత 23 మంది ఒకేచోటుకు చేరి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం ప్రత్యేకత సంతరించుకుంది.

బలిజకండ్రిగలో...



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

పాలసముద్రం, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజకండ్రిగ జడ్పీ హైస్కూల్‌లో 2005-2006 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు ఆదివారం కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, అప్పటి ఉపాధ్యాయులు కలసి ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. విశ్రాంత హెచ్‌ఎం లింగమూర్తి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు అప్పటి పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అప్పటి విద్యార్థులు పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మునిరత్నం నాయుడు, కుప్పుస్వామి, రఘు, ఏయిమల్లై, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విరూపాక్షమ్మ తిరునాళ్ల

గుడిపాల, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగంపల్లె పంచాయతీ కొండాపురంలో ఆదివారం విరూపాక్షమ్మ తిరునాళ్లను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం సత్యమ్మకు పొంగళ్లు పెట్టి, సాయంత్రం ఇరుపాక్షమ్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గెరిగ రూపంలో బాణసంచా పేలుస్తూ, మంగళవాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనుమానితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగింత

- మందుబాబుగా గుర్తించి విడిచిపెట్టిన వైనం

చిత్తూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఓ అనుమానితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే అతనో మందుబాబుగా గుర్తించి విడిచిపెట్టారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి నగర శివార్లలోని గంగాసాగరం వద్ద ఉన్న ఓ పెట్రోల్ బంకులో హిందీలో మాట్లాడుతూ.. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. తాను పెహల్గాంకు చెందిన వ్యక్తినని అక్కడినుంచి పారిపోయి వచ్చినట్లు హిందీలో చెప్పడంతో స్థానికులు భయపడ్డారు. వెంటనే చిత్తూరు తాలూకా పోలీసులకు ఆ వ్యక్తిని అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించాక.. మద్యం మత్తులో మాట్లాడినట్లు గుర్తించి, విడిచిపెట్టారు.

బంగారు గొలుసు దోపిడీ

చిత్తూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం సిద్ధంపల్లిలో చైన్ లాక్కెళ్లిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.... సిద్ధంపల్లిలో వెంకటాద్రి నాయుడి భార్య ధనలక్ష్మి (60) శనివారం రాత్రి ఇంటి వరండాలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. బిగ్గరగా కేకలు వేయడంతో పక్కనే నిద్రిస్తున్న ఆమె కొడుకు దొంగను వెంబడించినా దొరకలేదు. ఆదివారం ఉదయం చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే కఠిన చర్యలు

చిత్తూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ హెచ్చరించారు. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. వేలూరు రోడ్డులోని ఓ షాపింగ్‌మాల్‌లోని వ్యర్థాలను బయట పడేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆ షాపింగ్‌మాల్‌కు నోటీసులు జారీ చేసినా చలనం లేకపోవడంతో రూ.2వేలు జరిమానా వేసి వసూలు చేశారు. నగరంలోని ఇతర షాపింగ్‌మాల్‌ల నిర్వాహకులంతా నిర్దేశించిన బిన్‌లోనే చెత్తను వేయాలని, బయట వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఎద్దులవారిపల్లెలో కార్డన్‌సెర్చ్



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళ్యం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులవారిపల్లె పంచాయతీ కాటప్పగారిపల్లెలో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని పలు ఇళ్లను తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, వాహనాల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించి, యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లోకి అనుమానితులు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని, గ్రామస్తులు రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఏఎస్సై మల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ దావూద్, సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో గాలివాన



చిన్నమరెడ్డికండ్రిగలో విరిగిపడిన చెట్టు

వెదురుకుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలో ఆదివారం సాయంత్రం జోరుగా గాలివాన కురిసింది. పగలంతా ఎండ తాకిడి ఎక్కువగా ఉండటంతో ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. సాయంత్రం వాతావరణం చల్లబడి గాలివాన జోరందుకుంది. ఈ క్రమంలో మండల పరిధిలో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు సైతం గాలికి లేచిపోయాయి. జోరు వానతో చెరువుల్లోకి నీరు చేరింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

గాలివానకు నేలవాలిన వరిపంట



పెరుమాళ్లపెంట వద్ద నేలకొరిగిన వరిపంట

యాదమరి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చోట్ల రెండురోజుల క్రితం ఈదురుగాలులు, వర్షబీభత్సం సృష్టించింది. దీంతో కాశిరాళ్ల పంచాయతీ పెరుమాళ్లపెంట గ్రామానికి చెందిన అన్నాతమ్ముళ్లు వినాయకం, గజేంద్రలకు చెందిన చెరో ఎకరం విస్తీర్ణంలో కోతదశలో ఉన్న వరి పంట పూర్తిగా నేలకొరిగింది.

● అకాలవర్షంతో తీవ్ర నష్టం

శుక్ర, శనివారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు బలమైన గాలులు వీయడంతో మామిడి చెట్లు, కోతకు వచ్చిన మామిడికాయలు, వరిపంట, మిరప నేలకూలాయి. చేతికొచ్చిన దశలో అకాల వర్షాలు కురిసి పంటలు తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

పన్నూరులో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు



టీడీపీ గ్రామకమిటీ ఎంపిక చేసి డిక్లరేషన్ అందిస్తున్న మీరా

విజయపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు హరిజనవాడ, ఆది ఆంధ్రవాడలో ఆదివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు విజయపురం మండల ఎన్నికల పరిశీలకులు మీరా టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించి, కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. గ్రామంలో కార్యకర్తలందరూ సమష్టిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు గోవిందయ్య, శివలింగం, గాలి మురళీ, బెంజిమన్, పెరుమాళ్, లక్ష్మయ్య, బాబు, దొరైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల నిర్మాణంలో జాప్యమెందుకు?

● ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న కొందరు ఉద్యోగులు



పచ్చికాపల్లంలో నిర్మించిన నీటి తొట్టె

వెదురుకుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): పశువుల దాహార్తి తీర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించిన నీటి తొట్టెల నిర్మాణంలో జాప్యమెందుకని పాడి రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్తంగా 'పల్లెపండుగ 2025-26' ద్వారా నీటి తొట్టెల నిర్మాణపు పనులు చేపట్టాయి. క్షేత్రస్థాయిలో కొంతమంది ఉద్యోగుల నిర్లక్ష్యం ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. ఉదాహరణకు గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండలానికి 33 పశువుల తొట్టెలు మంజూరయ్యాయి. ఒక్కొక్క తొట్టెకు రూ.33,041 నిధులు కేటాయించింది. ఈ మండలంలో ఇప్పటి వరకు 24 పూర్తి చేశారు. మిగతా తొమ్మిది తొట్టెల పనులు జరగనే లేదు. ఒక్కొక్క తొట్టెను మూడు నాలుగు రోజుల్లో పూర్తి చేయవచ్చని అంటున్నారు. కానీ, నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం నిర్లక్ష్యం కాక ఏమిటని పాడి రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి పనులు చేయని వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పశువుల దాహార్తి తీరుస్తున్న నీటి తొట్టెలు

పశువులకు దాహార్తి తీర్చడానికి నిర్మించిన నీటి తొట్టెలు ఉపయోగపడుతున్నాయి. అడవులకు, ఇతరత్రా ప్రాంతాలకు మేపడానికి పోయిన పశువుల దాహార్తిని ఈ నీటి తొట్టెలు తీరుస్తున్నాయి. విధిగా ఆ తొట్టెలకు నీరు నింపాల్సి ఉంది.

మురకంబట్టులో గంగ జాతరకు ఏర్పాట్లు



మురకంబట్టులో ఏర్పాటుచేసిన ప్రవేశ ద్వారం - విద్యుద్దీపాలంకరణ

చిత్తూరు కల్చరల్, మే 11(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక పరిధిలోని మురకంబట్టులో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న గంగ జాతరకు ఉత్సవ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవ మండపం, ప్రవేశ ద్వారం, క్యూలైన్లు, తాగునీరు తదితర మౌలిక వసతులతో పాటు భక్తులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం

● ముగిసిన బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవంలో ఉత్సవర్లు - దేవరఎద్దుకు పూజ చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం, మే 11(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చిన్నమరెడ్డికండ్రిగలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి వారి తిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. కల్యాణోత్సవానికి చవటగుంటకు చెందిన పేట మునిలక్ష్మి, పేట హరికృష్ణారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. మహా కుంభ ప్రోక్షణ, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. దీనికి తంగేలిమిట్టకు చెందిన మంజుల, రెడ్డెప్పరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహం, దేవర ఎద్దును ఊరేగించారు. ఇంటింటా కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, ప్రధాన కార్యనిర్వాహకులు మిట్టపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి పర్యవేక్షించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు




కమ్మగుట్టపల్లె గ్రామస్తులతో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్

పూతలపట్టు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మగుట్టపల్లి సమీపాన గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పలురకాల అభిషేకాలతో పాటు శాంతి హోమం నిర్వహించారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆలయానికి విచ్చేయగా, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యువరాజు నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు హిమగిరి నాయుడు, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, కార్తికేయ చౌదరి, సోమశేఖర్ నాయుడు, చంద్రబాబు నాయుడు, నాయకులు, కమ్మగుట్టపల్లి గ్రామ పెద్దలు, ఆలయ కార్యనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే మొదటి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



బీఎన్‌ఆర్ పేట వద్ద అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధే నా మొదటి ప్రాధాన్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు రూరల్ మండలంలో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు గత టీడీపీ ప్రభుత్వంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణీ చంద్రప్రకాష్ వేయించారని చెప్పారు. మిగిలిన వాటిని మళ్లీ టీడీపీ ప్రభుత్వంలోనే వేస్తున్నామన్నారు. రూ.7.82 కోట్లతో సుమారు 92 అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. 5 వెంకటాపురం గ్రామం వద్ద ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్వరలో 6 కంపెనీలు ప్రారంభంకాబోతున్నాయని... ఇందులో స్థానిక యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, జయచంద్ర నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషితో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బీఎస్‌ఆర్ పేట వంతెన మంజూరైందని కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు మోహన్‌రాజ్, శశికర్ బాబు, మేషాక్, మంజూస్, నీలకంఠం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



పాలసముద్రం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణజిమ్మాపురంలో ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయ ఆవరణలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ కార్యక్రమం అలరించింది. భీముడు, దుర్యోధనుడి పాత్రధారులు యుద్ధ సన్నివేశాన్ని పద్యాల రూపంలో పాడి దుర్యోధన వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించి, పొంగళ్లు పెట్టారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బాలయ్య నాయుడి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ వేడుకలను తిలకించడానికి మండల వాసులతో పాటు తమిళనాడు సరిహద్దు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

వైభవంగా మాతమ్మ తిరునాళ్ల



విజయపురం, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్షూరికాపురం, నారపరాజుకండ్రిగ ఆది ఆంధ్రవాడలో ఆదివారం మాతమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఉదయం గెరిగను ఊరేగించి పూజలు నిర్వహించారు. వీధుల్లో వేప తోరణాలు కట్టి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కాపు కట్టుకొని వందలాదిమంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. మాతమ్మను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

కార్వేటినగరం టీచర్‌కి 'కవిరత్న' పురస్కారం



టీచర్ గిరిబాబు

వెదురుకుప్పం, మే 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గంగమాంబాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కరణం గిరిబాబుకు 'కవిరత్న' జాతీయ ప్రతిభా పురస్కారం ఆదివారం అందజేశారు. ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో భాగంగా ఏలూరు పట్టణంలోని మహాలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా అందుకున్నట్లు గ్రహీత చెప్పారు. కరణం గిరిబాబు తెలుగుభాష, తెలుగు సాహిత్యం, తెలుగు వైభవం, తెలుగు సంస్కృతి-సంప్రదాయాలు, తెలుగు కళల పరిరక్షణకు, అభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించి కవిరత్న జాతీయ ప్రతిభా పురస్కారంతో పాటు జ్ఞాపికను అందజేసి, శాలువతో సత్కరించి ప్రశంసా పత్రం అందించినట్లు చెప్పారు.

సన్మార్గంలో నడవండి



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

బంగారుపాళ్యం, మే 11(ఆంధ్రజ్యోతి): వేసవిసెలవుల్లో భాగంగా విద్యార్థులు, పిల్లలకు మండల కేంద్రంలోని కార్నర్ స్టోన్ చర్చిలో పాస్టర్ శామ్యూల్ ఆధ్వర్యంలో గత వారం రోజుల పాటు బైబిల్ పఠనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణ, సన్మార్గంలో నడవాలని వారికి శిక్షణ ఇచ్చారు. చివరి రోజైన ఆదివారం సాయంత్రం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ శిక్షణా తరగతులకు ముంగరమడుగు, వెంకటగిరి, తగ్గువారిపల్లె, గ్రీన్‌సిటీ, బంగారుపాళ్యం నుంచి విద్యార్థులు, పిల్లలతో పాటు పాస్టర్లు మేరీజాన్, దివ్య, రాకేష్ పాల్గొన్నారు.

వీల్ చైర్స్ పంపిణీ



చిత్తూరు కల్చరల్, మే 11(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు పలువురు లబ్ధిదారులకు 5 వీల్‌ఛైర్స్, 8 కుట్టుమిషన్లు, 2 ఏసి కిట్స్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, సత్యనారాయణ, శేషనారాయణ, గజేంద్రరెడ్డి, శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన టీడీపీ నేతలు



వెదురుకుప్పం, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడిని వెదురుకుప్పంకు చెందిన టీడీపీ నాయకులు ఆదివారం కాణిపాకంలో కలిసినట్లు తెలిపారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ లీగల్ సెల్ సెక్రటరీ భాష్యం పూర్ణచంద్ర నాయుడు, యువత నాయకులు భాష్యం సతీష్ నాయుడు కాణిపాక వినాయకస్వామి దర్శనార్థం వచ్చిన నేపథ్యంలో మంత్రిని తాము కలిశామని తెలిపారు.

రంగునీళ్లు వద్దు.. మంచినీళ్లివ్వండి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నగరి, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలో వచ్చే రంగునీళ్లు మాకొద్దు.. మంచినీళ్లు ఇవ్వండంటూ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరి సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రూ.20కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ఈటీపీ ప్లాంటును సద్వినియోగం చేసుకోకుండా సమస్యలు తీసుకురావడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈటీపీ ప్లాంటు నిర్వహణ ఖర్చులను, విద్యుత్ ఛార్జీలను డైయింగ్ యూనిట్ల యజమానులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండయ్య, పట్టణ అధ్యక్షుడు వేలన్, విజయకుమార్, బాషా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుసంక్రమణ పూజలు



గురు సంక్రమణ పూజల్లో దీపారాధనలు చేస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో ఆదివారం కాలభైరవట్రస్టు ఆధ్వర్యంలో గురు సంక్రమణ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మేష, మిధున, కర్కాటక, వృశ్చిక, మకర, మీన రాశుల వారు దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కాలభైరవ ట్రస్టు వ్యవస్థాపకులు టి.వెంకటేషన్, ఆలయ అర్చకులు శివకుమార్ శివాచార్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.